# సాహితీ పోషకులు

నాకు విశాఖపట్నం వెళ్లాల్సిన పని బడింది. విమానాలు, టాక్సీలు వచ్చాక విశాఖపట్నం వెళ్ళడం అంత ఇబ్బందిగా లేదు. ఎల్లాగో విశాఖ వెళ్తున్నాను. కనక రామారావు మేష్టార్ని కలుసుకోవాలనుకొన్నాను. అందుకని పని అవసరానికిమించి మరో రెండ్రోజులు విశాఖలో ఉండేలా కార్యక్రమం రూపొందించు కొన్నాను.

విశాఖలో పని పూర్తయి మేష్టారింటికి వెళ్ళాను. గురుపత్ని.

"మీ మేష్టారు ఏదో సాహిత్య గోష్టికి వెళ్లారు" అని చెప్పింది.

రామారావు మేష్టారికి కథకుడిగా కూడా మంచి పేరుంది. నాకు సాహిత్యంతో పెద్దగా పరిచయం లేదు. ఆయన నాకు చదువు చెప్పిన గురువు. ఆ విధంగానే ఆయనకి నేను, నాకు ఆయనా తెలుసును.

ఆవిడని మేష్టారు ఏ ఊరు వెళ్ళారని అడిగితే చెప్పింది. ఆ ఊరు విశాఖనుంచికార్లో మూడు నాలుగు గంటల ప్రయాణం. నా విమానం రెండ్రోజుల తరువాత. అందువల్ల ఆ ఊరువెళ్ళి మేష్టార్తో కొద్దికాలం గడిపి మర్నాడు విశాఖ రావాలనుకొన్నాను.

మా ఆఫీసు వాళ్లు నాకే సౌకర్యం కావాలన్నా ఏర్పాటు చేయటానికి ఉత్సాహం చూపిస్తారు. నేను విశాఖ నుంచి ఆ ఊరు ఎల్లావెళ్ళాలో అడిగి తెలుసుకోవాలని ప్రశ్నలు అడుగుతుండగా

"మీకెందుకుసార్! ఆ బస్సంతా శ్రమ! హాయిగా ఆఫీసు కార్లో వెళ్ళి వచ్చేయండి" అని కారు ఏర్పాటు చేశారు.

నేనాఊరు వెళ్ళేసరికి మేష్టారు వేదికమీదున్నారు. నన్ను చూసి దిగి వచ్చి తను ఏ హోటల్లో వున్నదీ చెప్పి సాయంత్రం 6 గంటలకి రమ్మన్నారు. అప్పుడు 4 గంటలైంది. రెండు గంటలే కదా అని బజార్లో తిరిగి 6 గంటలకి హోటలుకు వెళ్లాను.

మేష్టారి గది ఓ డబుల్ రూమ్. అందులో ఆయనా మరో రచయితా వున్నారు. మేష్టారు నన్ను ఆరెండో రచయితకి పరిచయం చేశారు.

ఏడు గంటలయ్యేసరికి తెల్లగా, బొద్దుగా వున్న ఒకాయన వచ్చారు.

"ఈయన సుబ్బారావుగారు. ఆదరణ పత్రిక సంపాదకులు. ఈ ఊళ్లో సాహిత్యగోష్టి ఈయనే ఏర్పాటుచేశారు" అంటూ మేష్టారు నాకు సుబ్బారావుగార్ని పరిచయం చేశాడు.

"నాకు మేష్టారి కథలంటే చాలా ఇష్టం. అయనంటే చాలా గౌరవం. అందుకే పట్టుపట్టి మేష్టార్ని ఈ గోష్టికి ఒప్పించి తీసుకువచ్చాను. మా పత్రిక చాలా విలువలున్న పత్రిక"

అని చెప్పారు సుబ్బారావుగారు. ఆయన మాటలు చాలా వినయంగా, నాజూకుగా వున్నాయి.

"ఇవాళ రాత్రి ఎనిమిది గంటలకి డాక్టర్ విజయ్ గారింట్లో డిన్నరుంది. ఆయన మంచి సాహితీ పోషకులు. మేష్టారితో మీరు కూడా అక్కడికి భోజనానికి రావాలి" అంటూ ఆదరంగా పిలిచారు.

"నువ్వు మొహమాటపడకు. సాహిత్యసభల్లో సాయంత్రం భోజనాలుండటం, ఆ సమయంలో రచయితల అతిథులకి కూడా రచయితలతోపాటు ఆతిథ్యం ఇవ్వటం మామూలే! వస్తే మా ప్రపంచం ఎలా వుంటుందో నువ్వు చూడవచ్చు" అన్నారు రామారావుగారు. సుబ్బారావుగారు వెళ్ళిపోయారు. "మీకు దారి తెలుసుగా. పొద్దున్న భోజనాలైనచోటే" అన్నారు వెళ్తూ వెళ్తూ మేష్టారితో.

భోజనాల సమయంలో నాకు డాక్టర్ విజయ్‌ని సుబ్బారావుగారు పరిచయం చేశారు. నన్ను పరిచయం చేయటానికి ఆయనకి నా పేరు కూడా గుర్తున్నట్టు లేదు. కప్పదాటు వేశారు.

"విజయ్‌గారు సాహితీ పోషకులే కాదు స్వయానా రచయితలు కూడా! ఆయన కథలు మన పత్రికలోనే మూడు దాకా వచ్చాయి" అని సుబ్బారావుగారు చెప్పారు.

"పువ్వులతో కూడిన దారానికి సువాసన అబ్బినట్టు రచయితలతో తిరగగా తిరగగా నాకూ కథలు రాయటం కొద్దిగా అబ్బింది. నాటకాల కంపెనీల్లో తిరిగి తిరిగి షేక్స్‌పియర్ నాటకకర్త అయ్యాడంటారు. అల్లాగన్నమాట" అన్నారు డాక్టర్ విజయ్. చాలా వినయంగా సహజంగా. షేక్స్‌పియర్ గొప్ప రచయిత అన్న పాటిజ్ఞానం నాకుంది. "మీరాయన కథలు మన పత్రికలో చూసే వుంటారు" అన్నారు సుబ్బారావుగారు.

చూశానంటే ఆయన నాకు పరీక్ష పెడ్తాడేమో అన్నభయం కలిగింది. కాని ఈ వ్యవహర్త పరీక్ష పెట్టడానికంటే పెట్టకపోవడానికే అవకాశం వుందని క్షణంలో బేరీజు వేసుకొని "చదవకేం! మంచి కథలు" అన్నాను.

"అంతా మీ సహృదయత. ఎప్పటికైనా రామారావుగారంతటివాడి నవగలనా అన్నది సందేహం" అన్నాడాయన మరోసారి వినయంగా.

రామారావుగారు రచయితగా ఎంత గొప్ప వాడో నాకు తెలియదు. అందుకని నవ్వి ఊరుకున్నాను.

భోజనాలయ్యాక హోటలుకి చేరుకొన్నాం. హోటల్లో మరోరూము ఖాళీలేదని తెలిసింది.

"మేష్టారులాంటి పెద్ద రచయిత మా హోటల్లో దిగటం మా హోటల్‌కే గొప్ప. ఆయన సన్నిహితులు మీరు. మీకు రూం ఇవ్వగలగివుంటే నాకంటే సంతోషించేవాడుండడు. నా ఇవ్వలేని అశక్తతని క్షమించి మా ఇంటికి వచ్చి పడుక్కోండి" అని హోటలు యజమాని ఆహ్వానించాడు నన్ను.

"ఆయన రామారావు గార్ని కలవడానికి వచ్చారని సందేహించాను కాని లేకపోతే ఆయన పడక డాక్టర్ విజయ్ గారింట్లోనే ఏర్పాటు చేద్దును" అన్నారు సుబ్బారావుగారు.

నేను కల్పించుకొని, "గట్టి నేలమీద పడుకోమని డాక్టర్లు సలహా ఇచ్చే వయస్సు నాకు వచ్చింది. ఆ ఇబ్బంది వచ్చింది. డాక్టర్లు సలహా ఇవ్వనూ ఇచ్చారు. నాకు మంచాలు, పరుపులు అక్కర్లేదు. ఓదిండిప్పించండి. నేలమీదే నడుం వాలుస్తా" అన్నాను.

హోటలు యజమాని ఓ పరుపు, దుప్పటి, దిండు ఆ గదిలోనే ఏర్పాటు చేశారు. సుబ్బారావుగారు వెళ్ళిపోయాక మేష్టారు ఆయన తోటి రచయిత కథల గురించి, నేను మాస్టారు కమామీషు గురించి మాట్లాడుకొని రాత్రి ఏ రెండింటికో నిద్రపోయాం.

పొద్దున్న మరో ఉపద్రవం వచ్చింది, బోర్‌వెల్ నుంచి నీళ్ళను పంపు చేసేపంపు చెడిపోయింది. సుబ్బారావుగారు వచ్చేసరికి కాలకృత్యాలు తీరక ఇబ్బంది పడ్తున్నాం.

"పదండి విజయ్‌గారింటికి" అంటూ ఆయన మమ్మల్ని హోటల్ ఖాళీ చేయించి డాక్టర్ గారింటికి చేర్చారు.

ఆయన "నో ప్రాబ్లమ్" అంటూ మమ్మల్ని విడిగా వున్న ఒక ఖాళీ గదికి తీసుకువెళ్ళారు. దానికి ఎటాచ్‌డ్ బాత్‌రూమ్ వుంది. గ్లేజ్‌డ్ టైల్స్ పరిచి వున్నాయి. డాక్టర్ గారి అస్పత్రి నుంచి నాలుగు కుర్చీలు వచ్చాయి.

కాలకృత్యాలు తీర్చుకోడం, షవర్‌కింద స్నానం పూర్తిచేసే సరికి డాక్టర్‌గారు వచ్చారు...

"మీరీ గదిలో ఎన్నాళ్ళున్నా నాకిబ్బందిలేదు. మొన్నటివరకు ఇందులో మా వాచ్‌మన్ వుండేవాడు. నిన్ననే ఉద్యోగం మానుకొని వెళ్ళిపోయాడు" అని డాక్టర్ విజయ్‌గారు చెప్పారు, సాదరంగా.

రామారావుగారి ముఖంలో ఏ భావం లేదు. ఆయన తోటి రచయిత మాత్రం షాక్ తిన్నట్టున్నాడు.

"మేష్టారు శ్రామికపక్షపాతి కనక డాక్టరుగారు ఈ గదిచ్చారు మాష్టారికి" అన్నారు సుబ్బారావుగారు నవ్వుతూ. మేష్టారు మాట్లాడటానికి ఇష్టంలేకో, శ్రామికులతో ఏకత్వం ఋజువు చేసుకోడానికో నోట్లో చుట్టదిక్కొట్టుకొని అంటించారు.

"నువ్వు విశాఖ ఎప్పుడు, ఎలా వెళ్తున్నావు?" అని అడిగారు కాసేపటికి మేష్టారు నన్ను.

"ఇప్పుడే! కార్లో" అన్నా అర్థం చేసుకొని.

''పద నేనూ వస్తున్నాను'' అంటూ ఆయన బయల్దేరారు. ఆయన్తోపాటే సుబ్బారావుగారూ, తోటి రచయిత బయల్దేరారు.

దార్లో సుబ్బారావుగారు కొందరు డబ్బు సంపాదించిన లేక పరపతిగల పారిశ్రామికవేత్తలు, న్యాయవాదులు, పోలీసాఫీసర్లు, ఇన్‌కంటాక్స్ ఆఫీసర్లు ఎంతటి సాహితీ పోషకులో చెప్పసాగారు. స్నానాలప్పట్నుంచి బాత్‌రూమ్‌లోని గ్లేజ్‌డ్‌టైల్స్ నన్ను ఆలోచనల్లో ఇబ్బంది పెడ్తున్నాయి. అవి మెరిసేవే గాని చవకరకంవి అని తట్టి స్థిమితపడ్డాను.